# నిరుద్యోగం ఎవరి లెక్కలు వారివే

**బొంబాయి** స్టాక్ ఎక్స్ఛేంజ్, సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఇకానమీ(సిఎంఐఇ)లు కలిసి గత ఏడాదిగా నిరుద్యోగ గణాంకాలను సేకరిస్తున్నాయి. 25 రాష్ట్రాలలో కుటుంబ సర్వేలను ఐదు విడతలుగా చేపట్టాయి. ఈ సర్వేలు ఇక ముందు కూడా కొనసాగుతాయి. గ్రామీణ ప్రాంతాలలో, నగరాల వారీగానూ, విద్యార్హతలు, వయసు, లింగ ప్రాతిపదికన, శ్రామికుల సంఖ్య, శ్రమలో పాల్గొంటున్న రేటు, ఉద్యోగిత, నిరుద్యోగ వ్యక్తుల సంఖ్య, నిరుద్యోగ శాతం వంటి అంశాలతో గణాంకాలను విడుదల చేస్తున్నారు. గత సర్వేలోనూ, ఇప్పటి సర్వేలోనూ ఈ అంశాలలో కన్పించిన తేడాలను కూడా పేర్కొంటున్నారు. ఈ గణాంకాలను మరింత విస్తరించాలని భావిస్తున్నారు.

ప్రభుత్వ గణాంకాలకంటే ఇవి మెరుగ్గా ఉన్నప్పటికీ, వీటికి కూడా కొన్ని పరిమితులున్నాయి. ఉద్యోగం చేయాలని కోరుకుంటూ, దానికోసం ప్రయత్నాలు చేస్తూ ఇంకా ఉద్యోగం పొందని వారినే నిరుద్యోగులుగా లెక్కిస్తున్నారు. అలాగే ఉద్యోగాన్ని కోరుకుంటూ దానికోసం ప్రయత్నాలు మానివేసిన వారిని నిరుద్యోగులుగా లెక్కించటంలేదు. అయితే విడిగా నమోదు చేస్తున్నారు. వీరిద్దరినీ కలిపి పెద్ద నిరుద్యోగంగా పేర్కొని లెక్కలిస్తున్నారు.

పెద్దనోట్ల రద్దుకు ముందు, రద్దు సమయంలో, రద్దు తర్వాత విడతలుగా సమాచార సేకరణ జరగటంతో ఈ గణాంకాలు ప్రాధాన్యతను పొందాయి. వీటిప్రకారం 14 ఏళ్ల వయసుదాటిన వారి సంఖ్య 96 కోట్లు. వీరిలో శ్రమలో పాల్గొంటున్న వారి సంఖ్య 40 కోట్లకు పైగా వుంది.

నోట్ల రద్దుకు ముందు నిరుద్యోగ రేటు 8.3 శాతముంది. ఇది మధ్యలో తగ్గి, అక్టోబరు మొదటి వారాంతానికి 8.2 శాతానికి చేరింది. పట్టణాలు, నగరాలలో ఇది 9.2 శాతానికి చేరింది. పెద్ద నిరుద్యోగం రేటు తిరిగి 15 శాతానికి చేరింది.

తన పాలనలో ఉద్యోగ కల్పన పెరిగిందంటూ నరేంద్రమోడీ ప్రకటనలు చేస్తున్నాడు. 2017 సంII జనవరి-ఏప్రిల్‌ల మధ్య శ్రమలో పాల్గొంటున్న వారి సంఖ్య 40.65 కోట్లనుండి 40.50 కోట్లకు తగ్గిపోయింది. అంటే ఆ నాలుగు నెలల్లో 15 లక్షల ఉద్యోగాలు పోయాయి. నోట్లరద్దు వల్ల ఆర్థిక వ్యవస్థ పుంజుకుని ఉద్యోగాలు పెరుగుతాయన్నది వట్టి మాటలని తేలిపోయింది. అయినా ప్రధాని ఉపాధిహామీ పథకం పనులను కలిపి ఉద్యోగాలు పెరిగినట్లుగా చెప్పుకున్నాడు. (ఆగస్టు 15 నాటి ఉపన్యాసంలో)

నిరుద్యోగం పాలక పార్టీలకు ప్రచారాస్త్రమే. అమెరికాలోని విద్యావేత్తలనుద్దేశించి మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఈనాడు భారతదేశమెదుర్కొంటున్న జరూరు సమస్య నిరుద్యోగం అన్నాడు. సగటున రోజుకు 30వేల మంది ఉద్యోగార్థులుగా వస్తుండగా 450 మందికి మాత్రమే ఉద్యోగాలు లభిస్తున్నాయన్నాడు. ఆయన చెప్పని అంశమేమంటే రోజుకు 12,500 మంది ఉద్యోగాలు కోల్పోతున్నారని సియంఐఇ లెక్కలు తెలుపుతున్నాయి.

ప్రభుత్వాధికారి మోహన్‌దాస్‌పాయ్ బిజెపి ప్రభుత్వం ఏడాదికి 55 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తున్నదని ఒక టి.వి. ఛానెల్‌లో మాట్లాడుతూ చెప్పాడు. దేశంలో కార్ల అమ్మకాలను బట్టి, ఉద్యోగుల ప్రావిడెంటు ఫండులో చేరుతున్న వారి సంఖ్యను బట్టి ఆయన ఈ సంఖ్యను చెప్పాడట.

భారతదేశంలో దాదాపుగా 40 లక్షల కార్లు, ట్రక్కులు, ఆటోలూ ఒక ఏడాదిలో అమ్ముడవుతున్నాయి. దీనిలో డ్రైవర్లుగా, మెకానిక్కులుగా 25 లక్షలమందికి ఉద్యోగాలు వచ్చివుంటాయన్నది ఆయన అంచనా. మోటారు వాహనాల అమ్మకాల్లో అధికభాగం పాతబడిన వాహనాల బదులుగా కొంటున్నవే. ఈ అమ్మకాలు 25 లక్షల ఉద్యోగాలు సృష్టించాయనటం చాలా అతి అంచనా.

ఇక ప్రావిడెంట్ ఫండ్ సంస్థ. 2015-16 ఇపిఎఫ్‌ఓలో 3.76 కోట్ల ఉద్యోగులు సభ్యులుగా వున్నారు. అంతకుముందు ఏడాదికంటే 27 లక్షలమంది పెరిగారు. వీరందరికీ ఉద్యోగాలు వచ్చాయి గనుక ప్రావిడెంటు ఫండు చెల్లింపుదారులుగా చేరారన్నది పాయ్‌గారి లెక్క. అయితే ప్రావిడెంట్ ఫండ్ చందాదారుల సంఖ్యలో అనేక లొసుగులున్నాయి. ఉద్యోగం పోగానే ఖాతా మూసివేయకుండానే, తర్వాత మరో ఉద్యోగంలో చేరినప్పుడు, కొత్త యజమాని ఉద్యోగి పేరిట కొత్త ఖాతా తెరుస్తాడు. ఇలా ఒకరిపేరిటే అనేక ఖాతాలుంటున్నాయని, ఆపరేట్ అవుతున్న ఖాతాలు తగ్గుతున్నాయనీ, ఇలా పనిచేయని ఖాతాలలో వేలకోట్ల రూపాయలు పేరుకుపోయాయని ఇపిఎఫ్‌ఓ నివేదికలే తెలుపుతున్నాయి.

ఇంతవరకూ తమ ఉద్యోగులకు ఖాతాలు తెరవని యజమానులు, ఇప్పుడు తెరిస్తే కొద్దిపాటి జరిమానా విధించే పథకాన్ని 2016లో ప్రకటించింది. దీనితో 2017 జనవరి నుండి మార్చి వరకూ చందాదారుల సంఖ్య 3.8 కోట్లనుండి 4.8 కోట్లకు, అంటే కోటి పెరిగాయి. ఇవి కొత్త ఉద్యోగాలు కాదన్నది స్పష్టమే.

తీవ్రమౌతున్న నిరుద్యోగ సమస్యను తగ్గించి చూపటానికీ, నిరుద్యోగులలో భ్రమలు కల్పించడానికీ చేస్తున్న ప్రయత్నాలివి. సిఎంఐఇ గణాంకాలు 2017 జనవరి - ఏప్రిల్ మధ్య 15 లక్షల ఉద్యోగాలు కోల్పోయినట్లు తేల్చింది. తరువాయి నాలుగు నెలల్లోనూ అదే స్థాయిలో ఉద్యోగాలు పోయాయని ఐదవ విడత సర్వే నిర్ధారించింది. పైన చెప్పిన రోజు 12,500ల ఉద్యోగాలు పోవటమన్న సంఖ్య ఈ లెక్కల ఆధారంగా చెప్పిందే.

కేంద్ర కార్మిక గణాంకశాఖ నమూనాగా 2000 మంది నుండి సమాచారం సేకరించేది. ఈసారి ఆ సంఖ్యను 10 వేలకు పెంచింది. సిఎంఐఇ గణాంకాలకు దగ్గరగానే దాని గణాంకాలూ వున్నాయి. నిరుద్యోగ సమస్య తీవ్రమౌతున్నదని అది కూడా నిర్ధారించింది.

అయినా గద్దె నెక్కినవారు ఉద్యోగాల కల్పనే తమ లక్ష్యమని చెప్పుకోవటం మానలేదు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకూ పూనుకోరు. అది తమకు చేతకాదని వారికి బాగా తెలుసు. అందుకనే ఉపశమన పథకాలనే ఉద్యోగాల కల్పనగా చూపెట్టి యువతను భ్రమల పాలు చేస్తున్నారు.

గ్రామీణ ఉపాధి హామీ పథకానికీ, మహిళల స్వయం సహాయక బృందాలకూ, ప్రభుత్వరంగంలో గృహ నిర్మాణాలతో ఉద్యోగాలు సృష్టిస్తానని ప్రభుత్వం చెబుతున్నది. దీనికోసం గ్రామీణాభివృద్ధిశాఖ తనకు కేటాయించిన రూ.48 వేలకోట్లు సెప్టెంబరుకు ఖర్చయి పోతాయి గనుక మరో రూ.17 వేలకోట్లు కేటాయించమని కోరింది. 30 నుండి 48 వేల కోట్లకు ఘనంగా పెంచానని ప్రభుత్వం ఆనాడు చెప్పుకుంది. నిజానికి జరిగిందేమిటంటే బడ్జెట్టును మూడునెలలు ముందుకు జరిపినందున గత ఏడాది కేటాయింపు కూడా దీనిలో కలిసాయి.

స్వయం సహాయక సంఘాలకు రుణాలను రూ.42 వేలకోట్ల నుండి 60 వేల కోట్లకు పెంచాలని నిర్ణయించింది. 2022 నాటికి గ్రామాలలో 2 కోట్ల ఇళ్లు నిర్మించటానికి కేటాయించిన రూ.23 వేలకోట్లనూ మరో 10 వేల కోట్లు పెంచాలని నిర్ణయించింది. కేటాయింపులు భారీగా వున్నాయి. కానీ నిధులేవి? ప్రాధాన్యతలను బట్టి ఒకదాని తర్వాత మరొకటి చేపడతామని అధికారులు చెబుతున్నారు.

ఈ పథకాలన్నీ అంకెల గారడీలే. అవినీతిమయంగా మారాయి. లక్ష్యాలలో సగం కూడా సాధించలేదని ప్రభుత్వ పథకాలే చెబుతున్నాయి. బ్యాంకు ద్వారా స్వయం సహాయక బృందాలకు రుణమివ్వటం సాధ్యం కావటంలేదు. ఈ రంగాన్ని బ్యాంకుల కప్పుచెప్పాలని సూక్ష్మరుణ సంస్థలను వెనక్కునెట్టింది ప్రభుత్వం. పేర్లు మార్చుకుని ఇవి మళ్లీ రంగంలోకి వచ్చాయి. జనాన్ని పిండుకుంటున్నాయి. గృహనిర్మాణం కూడా లక్ష్యాలను చేరకపోగా, అవినీతి మయమై ఇళ్ల ధరలు ప్రజలకు అందుబాటులో లేకుండాపోయాయి.

ఈ లోపాల సంగతలా వుంచితే, ఈ పథకాల అమలు వెనుక ప్రభుత్వానికున్న లక్ష్యం ఆర్థికవ్యవస్థ మెరుగుకు దొడ్డిదారి వెతకటమే. ఇవన్నీ వినియోగ పథకాలే. వీటినుండి వచ్చే ఆదాయంతో ప్రజలు నిత్యావసరాలు తీర్చుకుంటారు. అందువల్ల అమ్మకాలు పెరుగుతాయి. పరిశ్రమలు కోలుకుంటాయి. ఆర్థికవ్యవస్థ పుంజుకుంటుంది. ఇది సిద్ధాంతం. ప్రజల కొనుగోలు శక్తి హీనస్థాయికి చేరినందున ఈ పథకాలతో వారికి డబ్బులందించి సరుకుల కొనుగోలు చేసేట్లు చేస్తుంది ప్రభుత్వం.

ప్రజల కొనుగోలుశక్తిని పెంచేందుకు చర్యలు తీసుకోరు. గ్రామీణ ప్రజల కొనుగోలుశక్తి పడిపోవటానికి వ్యవసాయ సంక్షోభం కారణం. దానిని తీర్చరు. కీలకమైన భూసంస్కరణలను అమలు జరపరు. పరిశ్రమలు పెంచి ప్రజలకు ఉద్యోగాలు పెంచరు. తద్వారా వారికి శాశ్వత స్థిరాదాయం కల్పించరు.

ఇవి చేయకుండా ప్రజల కొనుగోలు శక్తి పెరగదు. కొన్ని ఉపశమన చర్యలు చేపట్టి, వాటినే ఉద్యోగ కల్పనగా చిత్రించి, కృత్రిమంగా కొనుగోలు శక్తి పెంచేందుకు పూనుకోవటం నిరుద్యోగాన్ని తీర్చదు. ఇది మరో సంక్షోభానికి దారితీస్తుంది.

ఈ ఖర్చును భరించడానికి ప్రజలపై పన్నులభారం మోపుతారు. ఇతర సహాయ నిధులలో కోతపెడతారు. ప్రజాపంపిణీ వ్యవస్థ మూసివేసి బ్యాంకు ఖాతాలో డబ్బు జమచేయటం; విద్యా వైద్యరంగాల ప్రైవేటీకరణతో వాటిఖర్చుల భారం మోపటం నిధుల కోతలో భాగమే. ఎడమ చేత్తో రూపాయిచ్చి, కుడిచేత్తో నాలుగు రూపాయలు లాక్కోవడమే. ఫలితం: హళ్లికి హళ్లి సున్నకు సున్న.

అందుకే నిరుద్యోగ సమస్యపై పాలకవర్గాలకు వాటి లెక్కలు వాటికున్నాయి. ఈ లెక్కల అంతరార్ధాలు వివరించి సాగుతున్న మోసాన్ని అర్థంచేయించి యువతను పోరాటమార్గం పట్టించటమే మనముందున్న కర్తవ్యం.

oooo